వలంటీర్లు సంక్షేమ సారథులు

● నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


నరసన్నపేట: అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: స్వచ్ఛందంగా ప్రజలకు సేవలు అందిస్తున్న వలంటీర్లందరూ ప్రభుత్వ సంక్షేమ సారథులని నరసన్నపేట ఎమ్మెల్యే, శ్రీకాకుళం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండల కేంద్రం నరసన్నపేటలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వలంటీర్లకు వందనం కార్యక్రమానికి హాజరైన అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించారు. వలంటీర్ల సేవలను అభినందించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు గుర్తించి వలంటీర్లు బాధ్యతగా పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. గత ప్రభుత్వ కాలంలో జన్మభూమి కమిటీ సభ్యులు చేసిన అరాచకాలు, టీడీపీ నాయకులు కక్ష సాధింపులు ప్రజలకు వివరించాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లకు ఎంతో గౌరవం ఉంటుందన్నారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు పొందిన వలంటీర్లను సత్కరించారు. ఎంపీపీ ఆరంగి మురళి, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, గుప్త, అప్పన్న, కృష్ణ, నర్సింగరావు, నరసన్నపేట, జమ్ము, ఉర్లాం సర్పంచ్‌లు బూరెళ్ల శంకర్, వాన గోవిందరావు, పోలాకి నర్సింహమూర్తి, పాగోటి రాజారావు, చింతల వెంకటరావు, పంగ బావాజీ నాయుడు, మండల పరిషత్ ఏఓ తిరుపతి రావు పాల్గొన్నారు.

పోలాకిలో..

పోలాకి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలాకి-1, పోలాకి-2, కుసుమపోలవలసకు చెందిన వలంటీర్లను సత్కరించారు. అనంతరం మండలంలోని అన్ని సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం షెడ్యూల్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓ సూర్యప్రకాష్ ప్రకటించారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కణితి కృష్ణారావుతోపాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సారవకోటలో..

సారవకోట: మండలంలోని బుడితి, అవలింగి, చీడిపూడి సచివాలయాలలో వలంటీర్లను శనివారం సన్మానించారు. వలంటీర్లకు వందనం కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, సీడీపీఓ హెచ్‌కె కామాక్షి, వైసీపీ నాయకులు నక్క తులసీదాస్, బోర శ్రీరామమూర్తి, పొన్నాన హరిప్రసాద్, కడుసు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జలుమూరులో..

జలుమూరు: వలంటీర్లు సంక్షేమ సారథులని వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ అన్నారు. రాణ, పెద్దదూగాం సచివాలయాలలో శనివారం వలంటీర్లను సన్మానించి అనంతరం సభలో మాట్లాడారు. ప్రతి వంటీర్ వారికి అప్పగించిన పనిని సేవా భావంతో చేస్తున్నారని వారి సేవలు కొనియాడారు. ఎంపీపీ వాన గోపి, వైస్‌ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, సర్పంచ్ తర్ర మాధవి, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు కనుసు సీతారాం, పార్టీ నాయకులు తర్ర భాస్కరరావు, తర్ర జీవరత్నం, వెలమల రామారావు, దుంగ ప్రసాద్, మూకల్ల సత్యం తదితరులు పాల్గొన్నారు.


జలుమూరు: రాణలో వలంటీర్లును సత్కరిస్తున్న ధర్మాన పద్మప్రియ

1,422 మందికి పురస్కారాలు

పాతపట్నం: ప్రభుత్వ పథకాలు, సేవలను ప్రజలకు చేరుస్తున్న వలంటీర్ సేవలను పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కొనియాడారు. పాతపట్నం మార్కెట్ యార్డులో నియోజకవర్గ స్థాయిలో వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను ప్రదానం చేశారు. పేదల కోసం పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థకు దేశంలోనే మంచి పేరుందన్నారు. సేవాభావానికి, మానవత్వానికి మారుపేరుగా నిలుస్తున్నారని ప్రశంసించారు. తెల్లవారక ముందే ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. జిల్లా నోడల్ అధికారి పి.వాసుదేవరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పాతపట్నం మండలంలో 400 మంది, హిరమండలంలో 198 మంది, కొత్తూరులో 370 మంది, మెళియాపుట్టిలో 284 మంది, ఎల్.ఎన్.పేట మండలంలో 170 మంది వలంటర్లుకు పురస్కారాలు అందయన్నారు. రూ.1.45 కోట్ల చెక్కు నమూనాను వలంటీర్లుకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం వలంటీర్లతో కలిసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డీఎల్‌డీఓ అలివేలు మంగమ్మ, పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, ఎల్.ఎన్.పేట ఎంపీడీఓలు జయంత్ ప్రసాద్, చంద్రకుమారి, పావని, కాశీప్రసాద్, ఎంపీపీలు, పీఏసీఎస్ అధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


:పాతపట్నం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వలంటీర్లు

బాబూ.. నీ బతుకంతా శవ రాజకీయాలేనా?

● పేదోడి ఇంటిస్థలంపై అక్కసు వెళ్లగక్కడం సిగ్గుచేటు
● నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్


పోలాకి జగనన్న కోలనీ వద్ద చంద్రబాబు వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, లబ్ధిదారులు

పోలాకి: చంద్రబాబూ..నీ బ్రతుకంతా శవరాజకీయాలేనా..? అంటూ పేదల ఇళ్ల స్థలాలపై ప్రతిపక్ష నేత చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పోలాకిలో జగనన్న లే అవుట్ వద్ద లబ్ధిదారులతో కలిసి చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడికి సెంటు స్థలం సరిపోదు సరే.. నీవు అధికారంలో ఉన్నపుడు ఎంతిచ్చావో, ఎన్ని ఇళ్లు కట్టించావో చెప్పాలి అంటూ ప్రశ్నించారు. ఎన్ని జాకీలు పెట్టి లేపినా లోకేష్ నాయకుడు కాలేడన్నారు. సొంతపుత్రుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌కు మా గ్రామ వలంటీర్లుకు ఉన్న రాజకీయ లక్షణాలు కూడా లేవని ఎద్దేవా చేశారు.

చంద్రబాబు పేదలకు క్షమాపణ చెప్పాలి

● పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి


పాతపట్నం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: అమరావతిలో 50 వేల మందికి పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే కార్యక్రమంపై అవమానకరంగా మాట్లాడిన టీడీపీ అధినేత చంద్రబాబు.. రాష్ట్రంలోని పేదలకు క్షమాపణ చెప్పాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి కూడలిలో ఉన్న దివంగిత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి శనివారం పూలమాల వేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అమరావతి పేరుతో భూదందా నిర్వహించిన చంద్రబాబు.. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీని అడ్డుకునేందుకు సుప్రీం కోర్టును ఆశ్రయించి భంగపడ్డారన్నారన్నారు. ఆక్రోశంతోనే సభ్యత మరిచి సెంటు భూమి సమాధులు కట్టేందుకు తప్ప.. ఎందకూ పనికిరాదని మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేద మహిళలకు 32 లక్షల పైచిలుకు ఇళ్ల పట్టాలు అందించారన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ యజ్ఞంలా ఈ ప్రభుత్వం చేపడుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఎం.తాతయ్య, నూలు ఈశ్వరరావు, గేదెల సూర్యం, పనుకు మోహన్, గురాడి అప్పన్న, ప్రహేల్లాద పుల్లాయ్, వై.సూర్యం, వై.వెంకటరమణ, బి.శ్రీరాములు, టి.ప్రవీణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం

పాతపట్నం: పాతపట్నంలోని నీమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు పది రోజులపాటు మూడు మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నామని డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మితులసీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద ఉన్న అంబులెన్స్‌ను శనివారం పరిశీలించారు. రెండు అంబులెన్స్‌ల సేవలతోపాటు మూడు ప్రధాన కూడల్లో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లను ఉపయోగించుకోవాలన్నారు. పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం పీహెచ్‌సీ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. వైద్యుడు శ్రీధర్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

ఆమదాలవలస: రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందించే వివిధ శిక్షణ కార్యక్రమాలను స్వయం ఉపాధి పొందేందుకు వినియోగించుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. వారంరోజులుగా ఫ్రెండ్స్ ఆఫ్ కోకోనట్ ట్రీ, వృత్తి శిక్షణ కార్యక్రమం (యంత్ర సహాయంతో కొబ్బరి చెట్టు ఎక్కేందుకు) శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ముగించారు. కొబ్బరి అభివృద్ధి సంస్థ ఆర్థిక సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కొబ్బరి చెట్టు ఎక్కే ప్రక్రియను సులభతరం చేయడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. ఆరు రోజులపాటు రైతులకు కొబ్బరి సాగు, రకాలు, చీడపీడలు వంటి అంశాలు తెలియజేసినట్లు తెలిపారు. బ్యాంక్ అధికారుల ద్వారా సోషల్ సెక్యూరిటీ, ఇన్సురెన్స్, సెంట్రల్ ఫైనాన్స్ ఎడ్యుకేషన్ వంటి అంశాలపై అవగాహన కల్పించామన్నారు. మాస్టర్ ట్రైనర్లు రఘు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


యంత్ర సహాయంతో కొబ్బరిచెట్టు ఎక్కుతున్న రైతు

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి దుర్మరణం

పొందూరు: పొందూరు-వాంద్రంగి రైల్వే గేటు రాజాం రోడ్డు బ్రిడ్జి కింద గల రైల్వే ట్రాక్‌పైన ఫలక్‌నామా ఎక్స్‌ప్రెస్ ఢీకొని శనివారం ఉదయం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు చొక్కా, నీలం రంగు లుంగీ ఉన్నట్లు పేర్కొన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నంబర్ 7013273731ను సంప్రదించాలన్నారు.

పిడుగుపడి ఆవు మృతి


మృతి చెందిన ఆవు వద్ద రోధిస్తున్న రైతు

పొందూరు: మండలంలోని శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి లోలుగు గ్రామంలోని పంట పొలాల్లో పిడుగుపడింది. చోళ్ల అప్పలనాయుడుకు చెందిన ఆవు పిడుగుపాటుకు మృతి చెందింది. ఆవును పశువుల శాలలో కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. వర్షం కురుస్తూ పిడుగు పడిన శబ్దం రావడంతో ఎక్కడో పడిందని అనుకున్నాడు. అనుమానం వచ్చి రాత్రి సమయంలో పొలంలోని శాలలో చూడగా రూ. 70 వేలు విలువైన జెర్సీ ఆవుకు మృతి చెందినట్లు గుర్తించాడు. రైతు లబోదిబో మని ఏడ్చాడు. అప్పు చేసి కొన్నాని చెప్పాడు. సంబంధిత అధికారులు ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

రూ.5 లక్షల విరాళం


ఎమ్మెల్యే రెడ్డి శాంతికి రసీదు అందజేస్తున్న ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు

పాతపట్నం: పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారి గ్రామ పండగలు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులకు పాతపట్నంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి రూ.5,00,116లు విరాళంగా శనివారం అందజేశారు. ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు లింగాల మధుబాబు, లింగాల రవికుమార్, నూలు బుజ్జి, సవిరిగాన ప్రదీప్, పెద్దింటి అప్పారావు, మల్లికార్జునరావు, నూలు ఈశ్వరరావు, భానుమూర్తి, ఏఎంసీ చైర్మన్ అర్జునుడు, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం


చిన్ననీలాపురంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

● పాతటపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి
● గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి విశేష స్పందన

మెళియాపుట్టి: ఎండలు మండుతున్నా.. లెక్కచేయకుండా ప్రజల్లోకి వెళుతూ వారితోనే మమేకమై సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రెడ్డిశాంతి పాతపట్నం నియోజకవర్గప్రజల అభిమానాలను చూరగొంటున్నారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. మండలంలోని మర్రిపాడు-సి గ్రామ సచివాలయం పరిధిలోని చింతలపోలూరు, గేదెలపోలూరు, చిన్ననీలాపురం, పుస్తిలవార గిరిజన గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నవరత్నాల కరపత్రాలను పంపిణీ చేశారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేశామని, టీడీపీ ప్రభుత్వం పేదలకు సెంటుభూమి ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ప్రజాసమస్యలు తెసుకోవడానికే మీ వద్దకు వచ్చామని గిరిజనులతో ముచ్చటించారు. జెడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్య, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బైపోతు ఉదయ్ కుమార్, కన్వీనర్ పల్లి యోగి, వైస్ కన్వీనర్లు తేజారావు, శశిభూషణ్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఉర్లాన బాలరాజు, కోఆప్షన్ సభ్యుడు భాస్కర్ దాస్, సర్పంచ్ కావేరి, వైఎస్సార్‌సిపి నాయకులు పి.జయమునిరావు, తాళాభత్తుల ప్రసాదరావు, ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సరోజిని, ఏఓ ధానకర్ణుడు, ఏఈ శ్రీనివాసరావు, ఏపీఓ రవికుమార్, ఏపీఎం లలిత కుమారి, క్షేత్రసహాయకులు శేషగిరిరావు, సింహాచలం, సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మణి

ఆమదాలవలస రూరల్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. మండలంలో పొన్నాంపేట గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని సూచించారు. క్షణికావేశంతో తగాదాలు పెట్టుకుని విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. ప్రతి సమస్యను గ్రామంలోనే పెద్దల ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. కేసులను పరిష్కరించడానికి లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మి, న్యాయవాదులు చాపర రమేష్, సీపాన గోవిందరావు, చింతాడ సత్యనారాయణ, తమ్మినేని అన్నంనాయుడు, సీతారాం, ప్రసాద్, వెంకటరావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

విద్యా కానుక కిట్లు పరిశీలన

ఆమదాలవలస రూరల్: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంఈఓ దుప్పల రామారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిల్వ చేసిన జగనన్న విద్యా కానుక కిట్లును శనివారం పరిశీలించారు. మండలంలో 39,168 మంది విద్యార్థులకు సరిపడా జగనన్న విద్యా కానుక కిట్లు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మండల విద్యా సంక్షేమాధికారి పైడి కూర్మారావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నేరం

బూర్జ: మండలంలోని పాలవలస, అప్పలపేట, నీలాదేవిపురం గ్రామాల్లో వేరు వేరుగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలపై బూర్జ ప్రాథమిక ఆర్యోగ్య కేంద్రం వైద్యాధికార్లు జి.రాజశేఖర్, జి.పావని ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, చేయించుకున్నా చట్టరీత్యా నేరమన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

మెళియాపుట్టి: జగనన్నకు చెబుదాం కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి భవానీశంకర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో శనివారం సమీక్షించారు. వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తారన్నారు. ప్రజలను సంతృప్తి చెందేలా అధికారులు పనిచేయాలన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి ఉన్నారు.

బూర్జ: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి బి.ధర్మారావు అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. స్పందనలో వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని సూచించారు. ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, తహసీల్దార్ ఎస్.రమణారావు, పలువురు మండలాధికారులు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో విద్యార్థుల ప్రతిభ



విజ్ఞాన రూపేష్ బిందుశ్రీ సాహు

సారవకోట: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు శనివారం విడుదలైన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపించారు. వైద్యభూషణ విజ్ఞాన రూపేష్ 799 ర్యాంకు, బిందుశ్రీ సాహు 1309 ర్యాంకులు సాధించారు. వీరిద్దరూ స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదవడంతోపాటు అక్కడే పాలిటెక్నిక్‌కు కోచింగ్ తీసుకున్నారు. కోట భావనకు 2230 ర్యాంకు వచ్చింది.

పోస్టర్ ఆవిష్కరణ..

ఆమదాలవలస: మెండ విమలమ్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జూన్ 1 న నిర్వహించనున్న ఏసుక్రీస్తు రక్షణ సువార్త సభ, ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం చిట్టమ్మ క్వార్టర్స్‌లో గల షిలోహు ప్రార్థన మందిరంలో పలువురు సంఘ సేవకులు ఆవిష్కరించారు. యోషయా, సీజేఏసీ అధ్యక్షుడు రాడ విజయ్‌కుమార్, శ్యామ్యూల్ మెండ శ్రీనివాసరావు, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జార్జ్ ముల్లర్, మండల అధ్యక్షుడు కృపావరం, జీడీపాల్‌తోపాటు సంఘ సేవకులు సుమారు 40 మంది పాల్గొన్నారు.

శ్రేయా మిశ్రోకు పరిమళ బిరుదుతో సత్కారం

పాతపట్నం: విశాఖపట్నం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన వేసవి నృత్య సమ్మేళం 2023 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకు చెందిన శ్రేయా మిశ్రో అందర్నీ ఆకుట్టుకుంది. డాక్టర్ పనుమర్తి వెంకటరమణ, డాక్టర్ తాళ్లపాక సందీప్ కుమార్ తదితరులు శ్రేయా మిశ్రోకు నాట్య పరిమళ బిరుదుతో శనివారం సత్కరించారు. నట్యగురువు అర్చన ఉషశ్రీ శివ మంజరి బిరుదుతో శ్రేయను సత్కరిచారు. నిర్వాహకులు జి.కనకమహాలక్ష్మి, ఎల్.ఇంద్రాణినరేంద్ర పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత సారవకోట

సారవకోట: మండల కేంద్రంలో జాగృతి కార్యక్రమంలో భాగంగా యువతకు శుక్రవారం నిర్వహించిన వాలీబాల్ పోటీలలో సారవకోట జట్టు విజేతగా నిల్చింది. ఈ జట్టు సభ్యులకు ఎస్‌ఐ అప్పారావు శనివారం ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేశారు.

20 యూనిట్ల రక్తం సేకరణ


రక్తదానం చేస్తున్న ఎస్‌ఐ లక్ష్మణరావు

పొందూరు: యువత కోసం జాగృతి కార్యక్రమాన్ని ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. స్థానిక కేవీఆర్ సినిమా హాల్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సభ్యులు కాళ్లకూరి శాంతారామ్, పెంకి చైతన్యకుమార్‌ల సహాయంతో రెడ్‌క్రాస్ సిబ్బంది 20 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. నలుగురు యువకులతోపాటు ఎస్‌ఐ రక్తదానం చేశారు. అలాగే సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టనరోజు సందర్భంగా 15 మంది అభిమానులు రక్తదానం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎల్.ఎన్.పేట: మండలంలోని చింతలబడవంజ, కవిటి గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు తీసుకుంటున్నట్లు అంగన్‌వాడీ సూపర్ వైజర్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమదాలవలస ఐసీడీఎస్ సీడీపీఓ నుంచి వచ్చిన ఉత్తర్వుల ప్రకారం రెండు గ్రామల్లోని అంగన్‌వాడీ పోస్టులకు ఓసీ మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులను అమదావలస సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

క్లుప్తంగా

అమ్మకానికి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

ఎల్.ఎన్.పేట: భూసారం పెంచేందుకు దోహదపడే కట్టి జనుము విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని, మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ శనివారం తెలిపారు. మండలంలోని 12 రైతు భరోసా కేంద్రాల్లోనూ కట్టిజనుమ విత్తనాలు అమ్మకానికి సిద్ధం చేశామన్నారు. మండలానికి కట్టిజనుము 4 క్వింటాళ్లు, జీలుగు 7 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయన్నారు. 50 శాతం రాయితీపై 10 కిలోలు, 8 కిలోల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరండి

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్నీ సదుపాయాలు ఉన్నాయని, మంచి కోర్సులు ఉన్నాయని, నిపుణులైన అధ్యాపకులు ఉన్నా అధ్యాపకులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. శనివారం పలు గ్రామాల్లో పర్యటించారు. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు ఉన్నాయని, ఇంటర్ పాసైన విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలన్నారు. వీరు చేపడుతున్న ప్రచారానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తుందని ప్రిన్సిపాల్ లత తెలిపారు. ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్‌సీ, బీకాం కంప్యూటర్స్ వంటి కోర్సులు ఉన్నాయన్నారు.

14 వరకు దరఖాస్తుల స్వీకరణ

నరసన్నపేట: ఇంటర్‌మీడియెట్ విద్యా మండలి కార్యదర్శి ఆదేశాల మేరకు నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ నారాయణస్వామి తెలిపారు. వచ్చే నెల 14 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి అడ్మిషన్లు నిర్వహిస్తామన్నారు. కళాశాలలో నాడు-నేడు పథకం ద్వారా అన్ని సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందని, అభివృద్ధి చేస్తుందన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీల్లో ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో బోధన జరుగుతుందన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

హిరమండలం: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి కె.ఎర్రమ్మ తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులకు శనివారం హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ ఫారుక్ హుస్సేన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు ఉన్నారు.

ఎస్‌ఎస్సీకి పేదింటి యువకుడు ఎంపిక



సరుబుజ్జిలి: మండలంలోని కూన జమ్మన్నపేట గ్రామానికి చెందిన సనపల సాయిసురేష్ ఇటీవల వెలువడిన ఎస్‌ఎస్సీ సీజీఎల్ పరీక్ష ఫలితాల్లో గ్రేడ్ పోస్టల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. ఈసీఈ బ్రాంచ్‌లో బీటెక్ పూర్తిచేశాడు. ఈయన తల్లిదండ్రులు మిన్నారావు, రమణమ్మ వ్యవసాయ కూలీలుగా ఉన్నారు. 10వ తరగతి వరకు స్థానిక ప్రైవేట్ విద్యా సంస్థలో విద్యను అభ్యసించాడు. ఎటువంటి కోచింగ్ లేకుండా మొదటి ప్రయత్నంలో ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నరసన్నపేట: మండలంలోని లింగాలపాడులో అభయాంజనేయ స్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం ముగిసింది. సర్పంచ్ యాబాజి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: 33/11 కేవీ ఆమదాలవలస సబ్-స్టేషన్ పరిధిలో ఉన్న 11కేవీ టౌన్-1 ఫీడర్ పరిధిలో గల శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస రోడ్డు వెడల్పు కారణంగా విద్యుత్ స్తంభాలు ఆదివారం వేయనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.భయ్యాన్నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని కృష్ణాపురం నుంచి విద్యుత్ కార్యాలయం వరకు చెట్టు కొమ్మలు తొలగించడం, మరమ్మతుల నిర్వాహణ చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని చింతాడ, నందగిరిపేట, సనపలవనిపెట, నాదానపురం, కంచవానిపేట, లంకాం రైస్ మిల్లు, బ్రిక్ ఇండస్ట్రీ, కృష్ణాపురం, చంద్రయ్యపేట, శ్రీదేవి థియేటర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.